మనీషి

– పి.చంద్రశేఖర అజాద్

(1991 ఏప్రిల్ నెల చతుర నుంచి రచయిత ప్రత్యేక అనుమతితో పునర్ముద్రణ)

(గత సంచిక తరువాయి)

"డాడీ..."

ఒక్కసారిగా ఉలిక్కిపడ్డాడు రావ్.

ఆలోచనా స్రవంతి తెగిపోయిందక్కడ.

ఎదురుగా తన కూతురు.

"రామ్మా" అన్నాడు.

తను మెల్లగా నడిచివచ్చింది.

"చెప్పమ్మా" అన్నాడు.

"కిందకు వెళ్దాం రండి డాడీ" అంది.

"నేను కొంచెం సేపు ఇక్కడే కూర్చుంటానమ్మా"

ఆ అమ్మాయి నాన్న దగ్గరగా వచ్చింది. రావ్ తన కూతుర్ని దగ్గరకు తీసుకున్నాడు.

"తాతయ్య ఎందుకు చచ్చిపోయాడు నాన్నా?" అంది.

జవాబు చెప్పకుండా తన బిడ్డ కళ్ళలోకి చూశాడు. ఆయన కళ్ళలో ఓ నీటిపొర మెరిసి మాయం అయింది.

"ఏమోనమ్మా రాత్రి కూడా బాగానే వున్నాడుకదా"

"అవును డాడీ. ఈరోజు ఉదయం లేచి మనవూరు వెళ్ళిపోతానన్నారు. నేను అదేం వీలుకాదు ఇంకా టెన్‌డేస్ వుండాలని చెప్పాను. తాతయ్య కాదు నేను వెళ్ళిపోవాలన్నారు డాడీ"

"అవునమ్మా ఆయనకి ఆ ఊరంటే ప్రాణం"

"ఆ ఊర్లో ఏముంది డాడీ"

"అక్కడ ఆయన పుట్టారు పెరిగారు. ఆడుకున్నారు. పనిచేశారు. ఆయనకు తెలిసింది ఆ ఊరే కదమ్మా. అందుకే ఆ ఊరంటే అంత ప్రేమ"

"డాడీ... మనుషులు ఊర్లను కూడా ప్రేమిస్తారా?"

"మీ తాతయ్యను చూస్తున్నావు కదమ్మా"

"మరి తాతయ్యతోపాటు నాయనమ్మ ఎందుకు రాలేదు డాడీ"

"రాలేదమ్మా. అక్కడ ఇంకా గేదలున్నాయి. అవి నాయనమ్మకి తప్పితే పాలు ఇవ్వవు. అందుకని ఎవరో ఒకరు అక్కడ వుంటారమ్మా" "అయినా డాడీ వాళ్ళంతా ఓల్డ్ అయిపోతున్నారు కదా. మన దగ్గరకొచ్చి ఎందుకు ఉండరు?" అంది ఆ అమ్మాయి.

"అదంతే అమ్మా.. ఈ హైదరాబాద్ విడిచి పెట్టి నువ్వు దూరంగా ఉండగలవా?"

"ఎందుకుండను"

ఆయనకు నవ్వు వచ్చింది.

"నిన్ను నాయనమ్మ దగ్గరికి పంపిస్తే ఉంటావా అమ్మా"

"డాడీ" అంది ఆ అమ్మాయి.

"చెప్పమ్మా"

"నాయనమ్మకు ఈ విషయం తెలియదుగా"

తిరిగి ఆయన ముఖంలో ఉద్వేగం చోటుచేసుకుంది.

కేవలం తలూపగలిగాడు.

"ఇప్పుడేం చేద్దాం నాన్నగారూ" అంది.

ఆయనకి దుఃఖం ఎగతన్నుకురాగా పక్కకు తిరిగి వెళ్ళాడు.

తిరిగి కిటికీ తలుపు తెరిచి చూశాడు.

ఎటు చూసినా భవనాలు నీలాకాశం నిశ్శబ్దం. మానవుడు సాధించిన ప్రగతికి గుర్తులు. కొద్దిసేపు అలా చూస్తూ నిలబడ్డాక తనలో ఉబికివస్తున్న ఉద్వేగాన్ని తనలో తాను దిగమింగుకోగలిగాడు.

"స్వప్నా ఏం చేస్తున్నావమ్మా" అంటూ వచ్చింది సులోచన.

"ఏం లేదమ్మా డాడీతో మాట్లాడుతున్నా"

"ఏమ్మాట్లాడుతున్నావు" అంది మెల్లగా. అప్పుడే ఫోన్ మోగింది.

రావ్ నడుచుకుంటూ వచ్చి అందుకున్నాడు.

"యస్..."

అటునుండి ఎవరో ఏదో చెబుతున్నారు. మౌనంగా తలూపుతూ వింటున్నాడాయన.

"అలాగే.. అలాగే" అంటూ ఫోన్ పెట్టేసి సులోచన ముఖంలోకి చూశాడు.

"ఎవరు?" అందామె.

"ఫ్రెండ్ ఫోన్ చేశాడు"

"పరిస్థితి బాగుండలేదంట. రెండు రోజులదాకా కర్ఫ్యూ ఉంటుందంటున్నారంటాడు"

"మరెలా?" అందామె.

ఎంత దాచుకుందామన్నా ఆమెలో ఆందోళన దాగటం లేదు.

రావ్ తల పంకించాడు.

వెంటనే ఫోన్ అందుకుని రింగ్ చేశాడు.

"గంగాధర్ కావాలి"

ఆయన లైన్లోకొచ్చాడు.

"గంగాధర్ వెంకట్ ఇప్పుడే ఫోన్ చేశాడు. పరిస్థితి బాగుండలేదంటున్నాడు. నిజమేనా?"

"అవును. పాత బస్తీలో అల్లర్లు దారుణంగా వున్నాయి. ఎంతమంది పోయారో లెక్కలేదు దిస్ బ్లడీ పొలిటీషియన్స్ నందరినీ వరసగా కాల్చేస్తే ఈ దేశం బాగుపడుతుందేమో" గంగాధర్ కంఠం ఆవేశంగా వణికింది.

"ఏమిటంత ఆవేశపడుతున్నావ్?"

"లేకపోతే ఏమిటి రావ్?" ఇప్పుడే నాకెవడో ఫోన్ చేసి చెప్పాడు.

"ఏమని?"

"సరిగ్గా ఈరోజు రాత్రి పన్నెండుగంటలకి ఈ ప్రాంతమంతా స్మాష్ చేస్తారంట"

"కంట్రోల్ రూముకి ఫోన్ చేశావా?"

"పుకార్లు నమ్మవద్దని జవాబు. మరి ఇప్పుడు ఏమిటి చేయటం?

"చేసేదేముంది. ఎలా అయినా సరే మనం నాన్న బాడీని మా ఊరు తీసుకువెళ్ళాలి"

"ఈ పరిస్థితుల్లో కుదురుతుందంటావా?" గంగాధర్ నిరాశగా అన్నాడు.

"నువ్వేమైనా చెయ్యి. ఇది జరిగి తీరాలి."

"కనీసం కర్ఫ్యూ పాస్‌లు ఇచ్చే సమయం కూడా లేదు. ఇదేదో కార్చిచ్చు రగిలినట్లు రగిలింది."

"అవును"

"కొద్దిసేపు నిశ్శబ్దం అనంతరం గంగాధర్ కంఠం వినిపించింది.

"నువ్వు మరీ సెంటిమెంటల్‌గా ఆలోచిస్తున్నావా రావ్"

"నో.." ధృఢంగా అన్నాడు.

"ఐయామ్ సారీ. ఇలా మాట్లాడాల్సి రావటం దురదృష్టకరమే. పరిస్థితులు మన చేతుల్లో లేవుకదా"

ఏది ఏమైనా ఆయన చివరి కోరికను తీర్చటం నా కనీస బాధ్యత. మనం ఏం చేయగలం అనేది అమ్మ ఆలోచించదు. కడసారి చూపుకు ఆమె నోచుకోకపోతే ఈ జీవితంలో ఆమె క్షమించదు"

"అయినా..."

"గంగాధర్ నాన్న శరీరాన్ని ఎలా అయినా సరే మా ఊరు చేర్చాలి. నిజమే. మా ఊరు కొన్ని వందలమైళ్ళ దూరంలో వుంది. నిజానికి అదో దూరంకాదు. ఇప్పుడు దూరమంతా ఈ నగరంలోనే వుంది. ఈ ఇరవై కిలోమీటర్ల దూరం. ఆ మాటకొస్తే అంత దూరం కూడా కాదు. కేవలం పది కిలోమీటర్ల దూరం అధిగమిస్తే చాలు. మనం గమ్యం చేరతాం"

"నిజమే. కానీ ఈ దూరంలోపే ఏమైనా జరిగితే"

"కీడెంచి మేలెంచమని పెద్దలు చెప్పారు. నువ్వు చెప్పేది నిజమే. కానీ నన్ను కూడా అర్ధం చేసుకో. అర్ధంలేని విశ్వాసాలకోసం అవి కూడా అందరివీ కాదు. ఏ కొద్దిమందో స్వార్ధపరుల ప్రయోజనాల కోసం ప్రశాంతకర వాతావరణం

బద్దలైంది. నాకిప్పుడు చాలా పట్టుదలగా వుంది. చాలాకాలం నాన్నను నేనూ అర్థం చేసుకోలేకపోయాను. ఇప్పుడు ఆయన చాదస్తుడుగా నాకు కనిపించటంలా. నా తండ్రిగా చెప్పటంలేదు. ఆయనకు తలవంచి అభివాదం చెయ్యాలనిపిస్తూంది''

''అఫ్‌కోర్స్... అఫ్ కోర్స్'' అవతలనుండి గంగాధర్ అంటున్నాడు.

''నీకు తెలియదు గంగాధర్. నాన్న ఈ రోజుకీ తన శరీరాన్ని పూర్తిగా కప్పుకోడు. ఎర్రటి ఎండలో కొన్ని దశాబ్దాలపాటు ఆయన శ్రమంతా ధారపోసి పంటలు పండించాడు. పదిమంది తింటుంటే ఆనందపడ్డాడు.

అతని జీవితాన్ని ప్రేమించాడు గంగా...ధర్'' కంఠం వణికింది.

''కంట్రోల్ రావ్.. ప్లీజ్ కంట్రోల్''

''నో.. ఐయామ్ నాట్ రావ్.. నేను సాంబయ్యని. భూషయ్యగారి సాంబయ్యని. నేను నిర్మించుకున్నవన్నీ కృత్రిమంగా కనిపిస్తున్నాయి. వాటే హెల్. ముక్కుపచ్చలారని బిడ్డల్ని కూడా కత్తుల్తో పొడుస్తున్నారంటే పండు ముసలివాళ్ళని కూడా నరుకుతున్నారంటే ఏమిటిది? ఎటు పోతున్నాం మనం''

గంగాధర్ హతాశుడై వింటున్నాడు.

''అందుకే నేను ఒకటే నిర్ణయించుకున్నాను. ఎలా అయినా సరే. నేను ఇక్కడినుండి బయలుదేరతాను. నాన్నను తీసుకెళ్ళటం కోసం నా ప్రాణాలు బలయినా ఐ డోంట్ కేర్. అసలు ఆయన్ని ఈ నగరం రమ్మని ఎందుకు బలవంతం చేశానా అని ఇప్పుడు సిగ్గుపడుతున్నా''

సులోచన తన భర్త దగ్గరకు వచ్చి ఏదో చెప్పాలనుకుంది. ఎప్పుడూ కనిపించని ఆగ్రహం తన భర్త కళ్ళలో ఈనాడు కనిపిస్తూంది. ఆయన మాటలు కూడా చాలా తమాషాగా వున్నాయి.

స్వప్న నిర్ఘాంతపోయి చూస్తోంది.

''ఓ.కె రావ్. నిన్ను నేను అర్థం చేసుకున్నాను. బాడీ చెడిపోకుండా చూడు. నేను గంట తర్వాత నీకు ఫోన్ చేస్తాను''

''బాడీకి ఏం కాదనుకుంటా. ఇప్పుడు సరిగ్గా పన్నెండు గంటలవుతూంది. నాలుగు గంటలకల్లా మనం ఇక్కడినుండి బయలుదేరగలిగితే బాగుంటుంది''

''ఐ విల్ ట్రై మై లెవెల్ బెస్ట్. రాత్రిపూటయితే చాలా కష్టం. రేపటికి పరిస్థితి ఇంకా వరస్ట్ కావచ్చు. అందుకే నేను గంటలో ఏ విషయం చెబుతానన్నాకదా''

''అలాగే ఎదురు చూస్తుంటాను'' అంటూ ఫోన్ పెట్టేసి సులోచన కళ్ళలోకి చూశాడు.

''అంత అవసరం రాకపోవచ్చు. అంతగా అయితే మన ఫ్రిజ్ మొత్తం ఖాళీ చేయాల్సి వుంటుంది'' అన్నాడు.

ఆమె తలూపింది.

''పదండి ఓసారి చూసి వద్దాం'' అన్నాడు.

అందరూ మెట్లు దిగి వెళ్ళారు.

హాలు మధ్యభాగంలో నిద్రపోతున్న వ్యక్తిలా భూషయ్య పడుకుని ఉన్నాడు. ఆయనకింద మెత్తటి పరుపులు వేశారు. ఆయన శరీరం మీద తెల్లటి వస్త్రం కప్పారు. చూసేవారికి ఆయన మరణించినట్లుగా లేడు. విశ్రాంతి తీసుకుంటున్నట్లుగా ఉంది.

ఆయన తలదగ్గర సాంబ్రాణి కడ్డీలు వెలిగించారు. అవి సువాసనను వెదజల్లుతున్నాయి. 'రావ్'ను చూడగానే వాళ్ళందరూ లేచి నిలబడ్డారు. ఓసారి తన తండ్రిని చూసుకున్నాక తిరిగి పైకి వెళ్ళిపోయాడు.

"స్వప్నా.. రామ్మా" అంటూ పిలిచాడు.

నిశ్శబ్దంగా అనుసరించింది.

పైకి వెళ్ళాక తనే మాట్లాడింది.

"డాడీ.. మా స్కూల్ బిల్డింగ్ గోడలమీద రాశారు."

ఏం రాశారమ్మా?"

"మతం మత్తుమందట. నిజమా డాడీ?"

"చూస్తున్నావు కదమ్మా"

"ఒక మనిషిని ఇంకో మనిషి చంపటానికి చేతులెలా వస్తాయి డాడీ"

"అలాంటి పనులు చేసేది పిరికివాళ్ళమ్మా. ఇంక మాటల్తో తాము ఎదుటివాడితో గెలవలేం అనుకున్నప్పుడు ఆ రకంగా వస్తారు"

"అది చాలా ఘోరం కదూ"

"అవునమ్మా"

"అలా చేసేవారికి అమ్మా, నాన్నా, పిల్లలూ వుండరా"

"ఎందుకుండరు? నువ్వు చెప్పావుగా. మతం మత్తుమందని. ఆ మత్తులో ఉన్నప్పుడు వాళ్ళు ఏమైనా చేస్తారు?"

"మతం అంటే ఏమిటి డాడీ"

ఆయన తన బిడ్డకేసి చూశాడు.

"నాకు తెలియదమ్మా."

"నిజంగానా? నిజంగా మీకు తెలియదా?"

"నిజంగానే తెలియదు. నాకే కాదు. ఈ దేశంలో చాలామందికి తెలియదు. మా మతం గొప్పది మా మతం గొప్పది అనేవారికి అసలు తెలియదు. వారికి తెలిసిందల్లా అధికారం మాత్రమేనమ్మా"

"డాడీ" అని అడిగింది.

"ఏమిటమ్మా?"

"డెడ్ బాడీని ఏం చేస్తారు? బరీ చేస్తారా?" తను ఏదో చెప్పబోయేలోగా తనే అంది.

"మన తమ్ముణ్ణి కూడా పూడ్చి పెట్టారుకదూ"

"స్వప్నా" సులోచన పిలిచింది.

స్వప్న అక్కడినుండి లేచి వెళ్ళిపోయింది.

"సాంబయ్యా ఇవాళ చేనుకాడికి వెళ్దాం" అన్నాడు భూషయ్య.

"నేను అన్నాలు వండి పంపిస్తాగా అప్పుడొస్తాడులే" అంది తులసమ్మ.

"సరే" అంటూ వెళ్ళిపోయాడు.

ఆ రోజు మాసూలు చివరిరోజు పెద్ద కుండపెట్టి అన్నం వండింది. చిన్న స్టీలు టిఫిన్ నిండా నెయ్యిపోసింది. పాలతాలికలు చేసేటప్పుడు బెల్లం తరిగింది. సాంబయ్యకి తెల్లటి రంగులో ఉన్న ఆ బెల్లం చూడగానే నోరూరింది. తులసమ్మే కొద్దిగా తీసి చేతిలో పెట్టింది.

వంకాయలూ, ములక్కాయలూ వేసి దప్పళం పెట్టింది. పచ్చళ్ళూ, పెద్ద టిఫిన్ నిండా పెరుగూ, ఇంకా పండిన అరటికాయలు కోసుకురా. ఇంక బయలుదేరుదురుగానీ" అంది.

అవి కూడా తట్టమీద పెట్టుకున్నాక బయలుదేరారు. దారిలో సాంబయ్యను ఎవరెవరో పలకరిస్తూనే ఉన్నారు.

"ఏందిరా సాంబయ్యా చేనుకాడికి పోతన్నావా?"

"మా నాన్న రమ్మన్నాడు"

"ఈ రోజుతో మీ అయ్యకి మాసూలు పని అయిపోతుందిలే"

చేలగట్లమీదుగా నడుస్తుంటే వస్తున్న గాలీ, పొలాల్లో గుంపులుగా కనిపిస్తున్న మనుషులూ అక్కడక్కడా దర్శనమిస్తున్న వరికుప్పలూ చాలా ఆహ్లాదకరంగా ఉంది వాతావరణం.

తట్ట చూడగానే అందరూ పనులు ఆపేసి చేతులు కడుక్కుని వచ్చారు. "భీవుడూ" అంటూ పిలిచాడు భూషయ్య.

"అందరికీ ఇస్తర్లు వెయ్యండిరా మీ ఇద్దరూ "

"భూషయ్యగారూ చిన్నబ్బాయి గోరెందుకులెండి" అంటూ మొహమాట పడుతుంటే

"నువ్వట్టా కూకో ఎంకయ్యా" అంటూ తనే గారెలు అందుకున్నాడు. ఇంకో పక్కన పూర్ణాలు కూడా ఉన్నాయి.

"సాంబయ్యా నువ్వాటిని అందుకో" అంటూ అందరి దగ్గరికి వెళ్ళి వడ్డించటం మొదలుపెట్టాడు.

"గారలప్పుడే తినెయ్యబాకండి. పచ్చడి చేసి పంపిచ్చుద్ది. చూడరా ఆ నేతిగిన్నె పట్రా" అంటూ అరిచి ఆ తర్వాత తనే అందుకుని చాలు బాబూ అంటున్నా వినకుండా వడ్డించాడు.

"తులసమ్మగారి చెయ్యంటే చెయ్యి" అంటున్నారెవరో. సాంబయ్యకి కూడా ఓ ఆకు వేసి 'నువ్వూ తినరా' అంటూ వడ్డించాడు.

వారందరితోనూ కూర్చుని తింటుంటే వనభోజనాలకు వెళ్ళినట్లుగా అనిపించింది. అత్యంత తృప్తితో అక్కడివారందరూ భోంచేశారు. చేతులు కడుక్కున్నాక అందరూ తలోపక్కన నడుం వాల్చారు.

"భూషయ్యగారు నెయ్యి చాలంటే యింటేగా ఇంక ఈ పూటతో పనాపెయ్యటమే"

"అంటే రేపు కూడా తులసమ్మగారి చేతివంట తింటాడు కాబోలు" అన్నాడో యువకుడు. అతను అయిదో తరగతివరకూ చదువుకుని, ఆ తర్వాత ఎందుకో తిరిగి పనులు చేసుకోవటానికే వచ్చాడు. వారందరూ మాట్లాడుకుంటుంటే భూషయ్యగారు భీముడితో కలిసి భోజనం చేస్తున్నాడు. అయిపోయాక వచ్చి అన్నాడు.

"ఇంక లేద్దామా?"

"ఉప్పుడేగదండయ్యా తింది. మెతుకులింకా కడుపులో ఉన్నాయి"

"నీ ఇష్టం వచ్చినప్పుడు లేద్దాం కోటేసు" అన్నాడాయన.

ఓ చోట కూర్చుని సాంబయ్యను దగ్గరికి పిలుచుకున్నాడు. ఏదో చెప్పాలని ఆరాటం ఉంటుంది. అయితే ఎలా చెప్పాలో అర్థంకాదు.

"అదికాదురా మనం పనిచెయ్యకుండా ఆళ్ళని చెయ్యమంటే చెయ్యరు. మనంకూడా వాళ్ళతోపాటు పనిచేత్తావుంటే చకచకా పనులు చేత్తారు" అన్నాడు.

సాంబయ్య మాట్లాడకుండా నాన్నకేసే చూశాడు .

"ఇన్ని మాసాలనుండి పసిబిడ్డని పెంచు కున్నట్లు సాక్కొచ్చా. ఏదైనా చేతికొచ్చిందాకా మనదికాదు. ఈసారి రెండోపంట ఇత్తాలో మినుములు చల్లాలో" అంటుంటే కోటేసు లేచి వచ్చాడు.

"భూషయ్యగారూ అబ్బాయిగారు బాగా చదువుకుంటున్నాడా?"

"ఆడ్నే అడుగు"

సాంబయ్య తలూపాడు.

"అబ్బాయిగోరికి పట్నంలో పెద్ద నౌకరీ దొరకాలయ్యగోరు" అన్నాడు.

"ఈ తులసమ్మకి చెబితే గయ్‌మంటదిగాని నౌకరన్నాక ఎవుడో ఒకడికి తలకాయొంచాలిరా కోటేసూ"

"అదయితే నిజవే దొరా... అయినా కలకటేరు నౌకరయితే ఆయనగోరి దగ్గరికే అందరూ లగెత్తుతారు కదండయ్యా"

"కలకటేరు గానీ ఆడి బాబుగానీ ఆడిమీన ఇంకో మొగుడుంటాడు కోటేసూ"

"అయ్య.."

"అందుకే భూవిని నమ్ముకోవాల. మడిసికి రెండెకరాల చెక్కుంటే సరిపోదా కోటేసూ"

"సరిపోతుందండయ్యా"

"ఎవడిపని వాడు చేసుకు బతకాల. సాంబయ్యకూడా భూవిని నమ్ముకుంటే సరిపోలా?"

కోటేసు సంశయంగా గొణుగుతుంటే అన్నాడు.

"ఓయ్..."

"అది కాదులే భూషయ్యగోరు. అబ్బాయిగోర్ని సదువుకోనీండి. అది సరే బాబో.. గేదె ఈనుద్దని తులసమ్మగోరు అన్నారు" అంటూ మాటమార్చాడు.

తిరిగి భూషయ్యగారు తన ధోరణిలో తను పడిపోయాడు.

"అవును కోటేసూ ఇయ్యాలా రేపా అన్నట్టుంది."

"ఈసారి పెయ్యదూడయితే బాగుంటుంది"

ఏ దూడయితే ఏందయ్యా ఆటికి మనం చేసేదేవుంది. ఆటమ్మ దగ్గర పాలుకుడుస్తాయి. ఆటి తిండి అయి తింటాయి. ఏళకి కొంచెం వొళ్ళు కడిగి ఆటిముందు గడ్డి పడేస్తే చాలు. ఇంక లేద్దామా పొద్దు గూకిపోద్ది"

"లెగుద్దాం అయ్యగోరూ" అంటూ కోటేసు నిలబడి పెద్దగా కేకపెట్టాడు. సాయంకాలం నాలుగుగంటలు అవుతుందనంగా పొలంలో ధాన్యపు రాసి.. ఆ దృశ్యం ఎంతో అపురూపంగా ఉంది. సంవత్సరం పొడవునా తమ రక్తం ధారపోసి సృష్టించిన సంపద అది.

వాటినన్నింటిని గోతాల్లోకి ఎత్తారు.

బండి తయారయివుంది.

"ఏం బాబూ.. బండి తోలతావా?" అన్నాడు భీముడు.

నాకు రాదుగా" అన్నాడు సాంబయ్య.

"రాదంటే ఎట్టా నేర్చుకోవాలి. తొట్టో కూకోండి. నేను చూపిత్తా" అన్నాడు.

సాంబయ్య బండి ఎక్కి తొట్లో కూర్చున్నాడు. దాన్నిండా గడ్డిపరిచి దానిమీదో గోతాం పట్టా పరిచారు. భూషయ్యగారింకా ఎవరితోనో మాట్లాడుతూనే వున్నాడు. కళ్ళాం దగ్గర చాకలాయనా, మంగలాయనా గోతాలు పట్టుకుని నిలబడి వున్నారు. అక్కడో మానిక కూడా వుంది. దాంతో ధాన్యం కొలిసి పోశాడు. కొలిచే ముందు గోతాంలో కొంచెం ధాన్యం వేసి ఆ తర్వాత కొలిచాడు.

"సరిపోయిందా?" అన్నాడు.

"అయ్య" అంటూ వాళ్ళు సంచుల మూతులు కట్టుకోవటం ఆరంభించారు.

ఆ చుట్టుపక్కల పరిగెలు ఏరుతున్న పిల్లల్లో కొందరు వచ్చి నిలబడ్డారు.

"మీ కీడ పనేంది" అంటూ కోటేసు వెంటపడ్డాడు.

"అయ్యగోరూ" అంటూ వాళ్ళింకా అలానే నిలబడితే "ఏందే. ఏ మాత్రం ఏరుకొచ్చా" అంటూ అడిగాడాయన.

"ఆ ఎన్నిలెండయ్యా. నూర్చుకుంటే అన్ని తాలు గింజలు నడుపు లొంగిపోయినయిగాని గిద్దెడు గింజలు రాలా"

"అయితే నన్నేం చెయ్యమంటావే"

"నీ దయ దొరా"

"కోటేసూ.. ఆ పిల్లలందరికీ తలా సోలెడుపోసి పంపు"

"ఎందుకండయ్యగోరూ మీరూరుకోండి"

"పోనీలే కోటేసూ మనచేలో పరిగ ఏరుకున్నా ఏం దొరకదు. అయినా పండిందంతా మనదేనా? ఎవడికెంత చేరాలో ఎక్కడికి చేరాలో అక్కడికి చేరిపోద్ది" అంటూ వేదాంతం మాట్లాడాడు.

అంతా అయిపోయాక బళ్ళన్నీ బయలుదేరాయి. వెనకాల కర్రతో బయలుదేరి వచ్చాడు భూషయ్య. భీముడు బండితోలుతూ చెప్పాడు.

"ముందు నాకు బండితోలటం రాదు. వెలపటేదో. దాపటిదేదో చెప్పమని నన్ను పరాచికాలాడేవోరు. మనయ్యగోరు ఊరుకోరుగానీ మన దున్నల్ని పందాలకు తీసుకెళ్తే సిగదరగ ఆటికెదురేలేదు.

"పందాల్లో ఏం చేస్తారు?"

"బరువులేసి లాగిత్తారు. ఏది ముందు వెళ్తే అది గెలిచినట్టు"

"మరి నాన్న పందాలకి ఎందుకు ఒప్పుకోడు?" అన్నాడు సాంబయ్య.

"నోరులేని జీవాల్తో పోటీ ఎందుకంటాడు దొర. అయినా దున్నపోతులు బరువులు మొయ్యటాకేకదా పుట్టింది."

"అవును" అన్నాడు సాంబయ్య తనకు తెలియకుండానే.

ఆ చుట్టుపక్కల సంవత్సరానికో, రెండు సంవత్సరాలకో పందాలు జరుగుతుంటాయి. అందులో ఎడ్లపందాలూ ఉంటాయి. దున్నపోతుల్తో కూడా ఎప్పుడైనా జరుగుతుంటాయి. అందులో ఎడ్లపందాలూ ఉంటాయి. దున్నపోతుల్తో కూడా ఎప్పుడైనా జరుగుతుంటాయి. మొత్తం గ్రామీణులంతా ఆ పోటీలపట్ల ఎంతో ఆసక్తి కనపరుస్తారు. వారిలో వారికి పోటీలు జరుగుతుంటాయి. ఒక్కోసారి అవి పట్టుదలలుగా మారతాయి. అయితే సాధారణంగా గ్రామీణులు ఆనందించే పోటీల్లో ఇవి ఒకటి.

భూషయ్యగారికి మాత్రం ఈ పోటీలు ఏమాత్రం ఉత్సాహం కలిగించలేకపోయాయి. ఒకటి రెండుసార్లు అలాంటి పోటీలకు ఎవరి బలవంతం మీదనో వెళ్ళి ఆ తర్వాత చాలారోజులపాటు బాధపడుతుండిపోయాడు.

"ఏంటో ఎవడి వెర్రి వాడికానందవని అంతంత బరువులేసి పానం పోయేట్టు బాదితే గెలిచినట్టా ఎందుకంటా ఇయన్నీ"

ఆయన బండి తోలుతున్నప్పుడయినా సాధ్యమైనంతవరకూ వాటి వంటిమీద దెబ్బపడనీయడు. చెర్నాగోలు గాల్లో మోగాల్సిందే తప్ప వాటి శరీరాన్ని తాకదు. సామాన్యంగా చాలామంది బండినడక మరీ మెల్లగా వుందంటే వాటిని కొట్టకపోయినా తోక మెలిపెట్టడం, బూతులు తిడుతూ అదిలించటం చేస్తారు. బూతులు తిడుతూ అదలించటం చేస్తారు. భూషయ్యగారు అలాను చేయడు. మెల్లగా వాటిని బతిమాలుకునే రీతిలో నడుపుతాడు. అవికూడా ఆయన మనసు తెలుసుకున్నవిధంగా ప్రవర్తిస్తాయి. ఎప్పుడూ నడువనని మొరాయించవు. తనకు ఏ అభిప్రాయాలూ లేనట్లుగా, ప్రపంచంలో ఏ విషయం పట్టనట్లుగా కనిపించే తన నాన్న ఉద్యోగాల విషయంలోనూ, ఎడ్ల పందాల విషయంలోనూ ఏర్పరచుకున్న అభిప్రాయాలు సాంబయ్యను ఆశ్చర్యపరిచాయి. దారిపొడుగునా అడుగుతూనే వున్నారు.

"ఏయ్.. ఏ మాత్రం రాలినియి"

"ఓ పాతిక కాడికి అయ్యుంటాయి."

"ఫర్వాలేదు గానీ ఇంకో నాలుగయితే బాగుండేది. పురిగాని కడుతున్నావా?"

"పురా ఇంకేవన్నానా? తిండిగింజలకుంచుకుని ఒకిడతవి అమ్మితేగానీ కుదరదు. ఇంకా బాకీలుండిపోలా.."

"అవున్లే.. ధరడిగావా?"

"లేదే పూర్ణయ్యగారికి తెలుసుగా. అన్నీ ఆయనే చూసుకుంటాడు.."

ఇంటిముందు బండ్లు ఆగాయి. బస్తాలన్నీ ఓ మూలగా పేర్చారు. కొన్ని బస్తాలు ఇంటిలోపలి బల్లమీద సర్దించాడు.

తులసమ్మకి ఇంటికొచ్చిన ధాన్యం చూసుకున్నాక కళ్ళలో తృప్తి కనిపించింది. ఏ మాత్రం అయ్యాయని తనూ అడిగింది. ఇరవై ఎనిమిదిదాకా అయినట్లు చెప్పాడు.

"ఇంకా తాలూ.. తప్పా ఉంటయ్యిగా" అన్నాడు.

"సాంబయ్య ఏం చేశాడు?"

"ఆడేం చేత్తాడు. దిక్కులు చూశాడు. అట్టాకూకుండే బదులు ఆడూ వచ్చి పనిచేయిచ్చుగా" అన్నాడు.

"చాల్లే. నువ్వు చేస్తంటేనే ఇన్ని వడ్లొచ్చిపడతన్నాయి. అయ్యా కొడుకూ కూడా చేత్తే అయ్యన్నీ ఎక్కడ పోసుకుందాం"

"సర్లే దానికెట్టా వుంది" అన్నాడు.

"ఏమో ఈరోజు రేత్రికి నిద్రపోనిచ్చేట్టులేదు"

"ఒక్కరోజు నిద్రదేవుందిలేవే. ముందావనయితే బాగుంటది. దాని బాధ చూడలేకపోతున్నా" అంటూ వెళ్ళాడు.

ప్రసవవేదన అనుభవిస్తున్న నెలలు నిండిన గేద తన యజమానివంక దీనంగా చూసింది. భూషయ్యగారు వెళ్ళి తలమీదా, పొట్టమీదా చేతులువేసి నిమిరాడు.

"అయిపోతుంది, ఈ రోజు అయిపోతుందిగా" అన్నాడు ఉదరాన్ని స్పృశిస్తూ.. అట్లా ఆ పనీ, ఈ పనీ చేస్తుంటే సమయం ఎప్పుడు గడిచిందో తెలియదు. సాంబయ్య పుస్తకాలు ముందేసుకుని జోగుతున్నాడు.

"సాంబయ్యా పడుకుంటావా?" అంది తులసమ్మ.

"నేను నిద్రపోవటంలా" అన్నాడు సాంబయ్య.

"పొద్దున్నే ఎండలో తిరిగి వచ్చావు కదా. కళ్ళమీదకు చూడు నిద్రముంచుకు వస్తోంది. ఈరోజుకి పడుకోలే. రేపు చదువుకుందువుగానీ" అంది.

సాంబయ్య కూడా మాట్లాడకుండా లేచి వెళ్ళాడు.

పడుకోగానే నిద్రపట్టేసింది.

మామూలుగా రోజూ మెలకువ వచ్చే సమయానికి మెలకువ వచ్చింది. కొద్దిసేపు ఎవరి మాటలూ వినిపించలేదు.

"దాని బాధ చూడలేకపోతున్నానే చావిడంతా తిరుగుతుంది" అంటూ వచ్చాడు.

"అదంతేలే నొప్పులు వస్తున్నాయి. నువ్వొచ్చి ఇటు కూర్చో" అంది.

"నొప్పులొస్తుంటే ఎలాగే" అన్నాడు.

"పోనీ దానిబదులు నువ్వు కను" అందామె చిరాకుగా.

"ఏంటామాటలు కొంచెం లాంతరు తీసుకుని నువ్వురా" అని తిరిగి చావిడి దగ్గరకు వెళ్ళిపోయాడు.

సాంబయ్యకు కూడా లేచి ఏం జరుగుతుందో చూడాలనిపించింది. అయితే లేవాలంటే బద్ధకం వేసింది. మరి కొంచెం సేపటికి ఎలాంటి మాటలూ వినిపించకపోవటంతో తిరిగి నిద్రలోకి జారిపోయాడు.

ఆ గేద బాధ భరించలేక మూలుగుతుంది. మనిషి కళ్ళనీళ్ళ పర్యంతం అయిపోయాడు. కొద్దిగా బయటకు వచ్చిన తలను పట్టుకుని గేదతోపాటు చుట్టూ తిరుగుతూనే వున్నాడు. అలా ఎంతసేపు తిరిగాడో లెక్కలేదు. ఎప్పటికో దూడ బయటకు వచ్చింది. దాన్ని జాగ్రత్తగా గడ్డిమీద పడుకోబెట్టాడు. ఆ తర్వాత అలానే కూర్చుని 'మాయ' వేసేదాకా ఆగి అది తీసుకువెళ్ళి పారేసి వచ్చాడు. ఆ దూడగోళ్ళు గిల్లాడు. ఇంకా ఏమేమో చేస్తున్నాడు. తులసమ్మ తన భర్తకేసి మంత్రించినదానిలా చూస్తోంది.

ఎవరితను? మొగమనిషేనా? కేవలం తమ సుఖం తప్పితే మాతృత్వాన్ని అందించటానికి స్త్రీపడే తపనను అర్ధం చేసుకునే తీరికలేని పురుషజాతికి చెందిన వ్యక్తా? కాదు.. కానేకాదు. జన్మనివ్వటంలోని మధురమైన అనుభవమూ, ప్రాణంపోయే బాధా తనకు తెలుసు. అయినా సరే ఈ అనుభవాలన్నీ ఉన్నా బొమ్మలా నిలబడిపోయింది.

ఎందుకాయన కళ్ళల్లో నీళ్ళు. ఎందుకా వ్యక్తి అంతగా తపించాడు. అతనికి వాసనలేదా? చీదర లేదా? జలదరింపు లేదా? అత్యంత క్రమశిక్షణతో పని పూర్తిచేసే డాక్టరా తను? ఎండలో, వానలో, చలిలో తన శరీరాన్ని నిరంతర బాధకు

గురిచేయటం మాత్రమే తెలిసిన ఈ వ్యక్తిలో ఇంతటి అపురూప స్పందనలున్నాయా? ఇది పిచ్చా? చాదస్తమా? మాటలకందని గొప్ప భావమా? మనిషికీ, ప్రకృతికీ, మనిషికీ, జంతుజాలానికీ ఉన్న సజీవ సంబంధాల ప్రేరణా?

ఏమిటిది? ఆ పశువు ఎంత బాధననుభవించిందో తను చెప్పలేదు. కానీ తన భర్త బాధను తను చెప్పగలదు. తన బిడ్డను చూసి ఆ పశువు పొందే ఆనందమూ తను ఊహించలేదు. ఎర్రటి ఎండలకు నల్లబడిపోయి గడ్డం పెరిగిపోయిన తన భర్త కళ్ళలో మాత్రం గొప్ప సంపద కనిపిస్తోంది. ధన్యుడు.. అంతవరకూ ఖాయం. మానవజన్మగానీ పశువుల జన్మగానీ మరింకేమైనాగానీ..

ఇంకేమైనా అంటే అవును.. మొక్కలే తనే స్వయంగా పాదులు తీస్తాడు. విత్తనాలు నాటుతాడు. నీళ్ళు పోస్తాడు. తను నాటిన విత్తనాలు తమ మొదటి లేత ఆకుల్ని ప్రపంచానికందిస్తున్నప్పుడూ అంతే. ఆ మనిషి పులకరిస్తాడు.

(కొనసాగింపు వచ్చే నెలలో)

COMMENTS